## క్లుప్తంగా

### ప్రీక్రిస్మస్ వేడుకలు



**ఆత్మకూరు:** పట్టణంలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ జేడీ చంద్రపాల్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. క్రైస్తవులు కొవ్వొత్తులు చేతబట్టి క్రీస్తు గీతాలను ఆలపిస్తూ క్రిస్టియన్‌పేటలో ప్రదర్శన నిర్వహించారు. చర్చి కార్యదర్శి నందవరం ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

### నేడు తల్లిదండ్రుల సమావేశం

**కావలి:** ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే తల్లిదండ్రుల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై ఎంఈఓ గోవిందయ్య ఉపాధ్యాయులతో శుక్రవారం సమీక్షించారు. ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి సమావేశానికి హాజరుకానున్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎం లావణ్యకు సూచించారు.

### గండిపాళెంలో 18 అడుగుల నీటిమట్టం

**ఉదయగిరి:** గండిపాళెం జలాశయంలో నీటి మట్టం శుక్రవారానికి 18 అడుగులకు చేరిందని ఇరిగేషన్ డీఈఈ చంద్రమౌళి తెలిపారు. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు జలాశయానికి 880 క్యూసెక్కుల వంతున ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించి వరిపంట సాగుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

### 15న క్రికెట్ టోర్నమెంట్

**సీతారామపురం:** క్రిస్మస్‌ను పురస్కరించుకుని బసినేనిపల్లిలోని ఏసీనగర్‌లో ఈ నెల 15న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116 నగదు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 96180 76899, 93471 80834, 89856 83235 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**కావలి:** ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి డిపో పరిధిలోని ప్రాంతాల ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 99592 25643 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

### 12 మద్యం బాటిళ్ల స్వాధీనం

**జలదంకి:** మండలంలోని జమ్మలపాళెం అరుంధతీయవాడలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో శెట్టిపల్లి బాలకుమార్ వద్ద 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై దేవిక తెలిపారు.

### ఆలయాల్లో చోరీ

**ఉదయగిరి:** గుడినరవలోని శివాలయం, అంకాళమ్మ ఆలయాల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఈ విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి కొచ్చింది. బుధవారం అర్ధరాత్రి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న రెండు ఆలయాల్లోని హుండీలను దొంగలు ధ్వంసం చేసి నగదుతో పాటు వెండి పూజా సామగ్రిని అపహరించుకెళ్లారు. ఈ మేరకు గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందజేశారు.

### జాబ్‌మేళాకు స్పందన


**కావలి:** ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో కావలిలోని విక్రమ సింహపురి వర్సిటీ పీజీ సెంటర్‌లో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. గ్రీన్‌టెక్, ముత్తూట్ ఫైనాన్స్, బ్లూస్టార్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, తదితర కంపెనీలు ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు మొత్తం 40 మంది హాజరుకాగా, 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, వీఎస్‌యూ పీజీ సెంటర్ ప్రిన్సిపల్ తెలిపారు.

### ఆశీర్వచనం



**కావలి:** పట్టణంలోని ఆర్ఎస్సార్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేమిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రసూన దంపతుల కుమారుడు వినీత్ కృష్ణ వివాహం శుక్రవారం రాత్రి జరిగింది. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

### రేపు అఖిలపక్ష సదస్సు



**ఉదయగిరి:** వెలుగొండ జలాల సాధనకు ఈ నెల 8న కడపలో అఖిలపక్ష సదస్సు నిర్వహించనున్నట్లు వెలుగొండ జలాల సాధన సమితి నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్లను దుత్తలూరు మండలం ఏరుకొల్లులో శుక్రవారం ఆవిష్కరించారు. ఉదయగిరి మెట్ట ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ జలాలు అవసరమన్నారు. అఖిలపక్ష సదస్సుకు ఉదయగిరి ప్రాంత మేధావులు, నాయకులు, రైతులు హాజరుకావాలని కోరారు.

# దర్గాగా కబ్జా

**ఏఎస్‌పేటలోని గ్రామనత్తంపై కన్నేసిన ఆక్రమణదారులు**

- రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులు తారుమారు
- 20 సెంట్ల స్థలం రూ.1.15 కోట్లకు విక్రయం
- మంత్రి నారాయణ అనుచరుడి ప్రమేయంతో నిర్వాకం

**ఆత్మకూరు:** ఆ స్థలం అనాదిగా గ్రామ పంచాయతీకి చెందింది. గ్రామ నడిబొడ్డున ఉన్న ఈ స్థలం మధ్యలో ఉన్న మెట్ల బావిని గతంలో గ్రామస్తులు తాగునీటి అవసరాల కోసం వినియోగించేవారు. కాలక్రమేణా బోర్లు రావడంతో బావి నిరుపయోగంగా మారింది. గ్రామనత్తం స్థలం సైతం పిచ్చిచెట్లతో నిండుకుంది. ప్రస్తుతం స్థలాల ధరలకు రెక్కలు రావడంతో కొందరు గ్రామనత్తంపై కన్నేశారు. క్రమక్రమంగా బావిని ఎవ్వరికీ అనుమానం రాకుండా పూడ్చేశారు. గ్రామ నత్తం స్థలాన్ని రెవెన్యూ రికార్డుల్లో తారుమారు చేయించి రూ.1.25 కోట్లకు హైదరాబాద్‌కు చెందిన వారికి గుట్టుచప్పుడు కాకుండా విక్రయించినట్లు సమాచారం. మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం హజరత్‌నాయబ్‌రసూల్ వారి దర్గా ఉంది. ఇక్కడకు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. కొందరు ఇక్కడే రోజుల తరబడి ఉండి సేవలు చేసుకుంటుంటారు. దీనికి తోడు ఏఎస్‌పేట పరిసర గ్రామాలకు చెందిన వారు తరలి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏఎస్‌పేటలోని స్థలాలకు డిమాండ్ పెరిగింది.

**సాయిబాబా మందిరం పేరుతో..**

దర్గాకు సమీపంలోని తూర్పువైపున కామాక్షి కల్యాణ మండపం సమీపంలో సర్వే నంబర్ 133లో సుమారు 20 సెంట్లు (120 అంకణాలు) స్థలం గ్రామ పంచాయతీకి చెందినది ఉంది. అందులో సుమారు 3 నుంచి 4 అకణాలకు మాత్రమే పట్టా ఉంది. అందులో ఇల్లు ఉండేది. అందుకు సంబంధించి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రావు, రాజశేఖర్ సోదరులు అనాదిగా శిస్తు కడుతూ వస్తున్నారు. తమ ఇంటి స్థలానికి అనుకుని ఉన్న గ్రామనత్తం స్థలంపై వారు కన్నేశారు. స్థలం మధ్యలో ఉన్న దిగుడు బావిని క్రమక్రమంగా ఏడాదిన్నర వ్యవధిలో పూడ్చేశారు. అనంతరం స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. స్థానికులకు సాయిబాబా మందిరం నిర్మిస్తున్నామని చెప్పడంతో వారు మిన్నకుండిపోయారు. అనంతరం కొద్దికాలానికి గ్రామనత్తం స్థలం తమదేనని ప్రచారం చేసుకున్నారు.

**ఎన్నికల సమయంలో..**

గత ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన రెవెన్యూ సిబ్బందిని మాయ చేసి గ్రామ నత్తం స్థలం తమదేనని రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. సర్వేయర్ సహకారంతో వెంకటేశ్వర్లు, ప్రసాద్, రాజశేఖర్‌తో పాటు వారి కుటుంబానికి చెందిన మరో ఇద్దరి పేర్లు కలిపి మొత్తం ఐదుగురికి పార్టీషన్ చేయించుకున్నారు. ఈ తతంగం అంతా రీసర్వే డీటీ సతీష్ నడిపించి వెరిఫికేషన్ చేసినట్లు, ఆ స్థలం వారిదేనని ధ్రువీకరిస్తూ సంతకం పెట్టి చక్రం తిప్పినట్లు సమాచారం. అన్నదమ్ముల్లో ఒకరైన రాజశేఖర్ నారాయణ విద్యా సంస్థల్లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు మంత్రి అనుచరుడు సహకరించినట్లు సమాచారం.

**సాక్ష్యం చెప్పినందుకు రూ.30 వేలు**

ఈ వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శి మొదలు రెవెన్యూ అధికారులకు సాక్ష్యం చెప్పేందుకు సమీపంలో ఇళ్ల వారికి రూ.30వేల వరకు ముట్టజెప్పినట్లు సమాచారం. స్థలం అన్నదమ్ములకే చెందిందేనని, తమకెప్పటి నుంచో ఆ విషయం తెలుసునని చుట్టుపక్కల వారితో సాక్ష్యం చెప్పించుకుని దాని ఆధారంగా ఎన్‌ఓసీ తెచ్చుకున్నారు. అనంతరం రికార్డులను తారుమారు చేయించినట్లుగా తెలిసింది.



బావిని పూడ్చి చదును చేసిన గ్రామనత్తం స్థలం

### రూ.1.25 కోట్లకు విక్రయం

అన్నదమ్ములు ముగ్గురు, మరో ఇద్దరు కుటుంబ సభ్యుల పేర్లతో పార్టీషన్ చేయబడిన గ్రామనత్తం స్థలాన్ని స్థానికంగా ఉన్న ఇద్దరు మధ్యవర్తుల సహకారంతో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి అమ్మకానికి పెట్టినట్లు తెలిసింది. మొత్తం రూ.1.25 కోట్లకు బేరం కుదుర్చుకుని రూ.30 లక్షలు అడ్వాన్స్ సైతం తీసుకున్నట్లు సమాచారం. హోటల్, లాడ్జి నిర్మించేందుకు సదరు వ్యక్తి స్థలాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా గ్రామ పంచాయతీకి చెందిన స్థలాన్ని దర్గాగా కబ్జా చేసిన వారికి మంత్రి నారాయణ అనుచరుడు, మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గంలో కొందరు 'సహకరించడం'పై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ విషయమై అప్పటి పంచాయతీ కార్యదర్శిని సంప్రదించగా తాను కేవలం 3, 4 అంకణాలకు మాత్రమే శిస్తు కట్టించుకునే వాడినని, మిగిలిన స్థలం పంచాయతీదేనని చెప్పడం విశేషం. మండల ఇన్‌చార్జి తహసీల్దార్ జీ వెంకటేశ్వర్లును సంప్రదించగా జేసీ, ఆర్డీఓ ఆదేశాలతో స్థలాన్ని పరిశీలించామన్నారు. సర్వే నంబరు 133లో మొత్తం 12.57 ఎకరాలు గ్రామనత్తంగా నమోదై ఉందని తెలిపారు. అందులో ఒకటిన్నర ఎకరా స్థలంలో దర్గా నిర్మాణమై ఉందని, దాని సమీపంలోని ఈ స్థలం గ్రామ పంచాయతీకి చెందిందేనని వెల్లడించారు. ఆత్మకూరు ఆర్డీఓ బీ పావనిని సంప్రదించగా గ్రామ నత్తం ఆక్రమణ విషయం తన దృష్టికి వచ్చిందని, మండల రెవెన్యూ అధికారిని పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదికను అందజేయాలని ఆదేశించామన్నారు. జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు(ఫైల్)

### రేపట్నుంచి విశేష హోమాలు

**కావలి:** ముసునూరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం నుంచి మూడ్రోజుల పాటు ప్రత్యంగిర వారాహిదేవి హోమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కృత్యప్రత్యంగిరా తాంత్రిక పీఠం ఆధ్వర్యంలో సనాతన ధర్మ కోసం నిర్వహిస్తున్న హోమంలో భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని కోరారు.

### 9న చెరువు చేపల వేలం

**సోమశిల:** అనంతసాగరం మండలం పడమటి కంభంపాడులోని ఎర్రచెరువులోని చేపల వేలం పాటను ఈ నెల 9న మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సచివాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్ పుల్లయ్య శుక్రవారం తెలిపారు. ప్రభుత్వం రూ.3.50 లక్షల ధర నిర్ణయించిందని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ముందస్తుగా రూ.10వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేలం చెరువును దక్కించుకున్న వారు సగం మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

### అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

**ఉదయగిరి:** ఈ నెల 15న పౌర్ణమి సందర్భంగా తమిళనాడులో అరుణాచలం క్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల కోసం ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉదయం ఉదయగిరిలో బస్సు బయల్దేరుతుందని చెప్పారు. 15వ తేదీ అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. ఒక్కొక్కరికి రాను, పోను చార్జీ రూ.1,650గా నిర్ణయించామని, ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**కావలి:** రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రుద్రకోట గ్రామ సచివాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. రుద్రకోటను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కావలి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ, ప్రత్యేక అధికారి మల్లారెడ్డి, తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

**అల్లూరు:** అల్లూరులోని గ్రామ సచివాలయం-4లో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఏపీడీ మృదుల, మండల సర్వేయర్ అశోక్, ఆర్‌ఐ ప్రభుదీప్, టీడీపీ ఉపాధ్యక్షుడు బీద గిరి పాల్గొన్నారు.

**జలదంకి:** అన్నవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ప్రమీల పాల్గొని రైతుల నుంచి 22 అర్జీలు స్వీకరించారు. కాగా శనివారం బ్రాహ్మణక్రాకలో జరగాల్సిన సదస్సును జనవరి 2 వతేదీకి వాయిదా వేసినట్లు ఆమె చెప్పారు. ఆర్‌ఐ శ్రీజ, సర్వేయర్ శోభన్‌బాబు, వీఆర్వో గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

**అనుమసముద్రంపేట:** స్థానిక సచివాలయంలో డీటీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. వివిధ సమస్యలపై 4 అర్జీలు అందాయి.

**వరికుంటపాడు:** అలివేలిమంగాపురం, ఇస్కపల్లె గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ పీ హేమంత్‌కుమార్ పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వీఆర్వో మనోహర్, సర్వేయర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

**కలిగిరి:** తూర్పుదూబగుంట, తెల్లపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు పాల్గొని అర్జీలను స్వీకరించారు.

**సీతారామపురం:** చింతోడులో తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఒకే ఒక్క రైతు సాదాబైనామాపై అర్జీ సమర్పించారు.

**దుత్తలూరు:** తిమ్మాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ యనమల నాగరాజు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

**సంగం:** పెరమనలో తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని సందర్శించి రైతుల అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రత్యేక అధికారి రమేష్‌నాయక్, ఆర్‌ఐ రాజా పాల్గొన్నారు.

**ఆత్మకూరురూరల్:** నబ్బీనగరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులు తమకు భూ యాజమాన్యపు హక్కులు కల్పించాలని కోరగా అర్హుల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. పమిడిపాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో డీటీ స్వరూప్ రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.



ఆత్మకూరురూరల్: ఆర్డీఓ పావనికి తమ గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు



కావలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

**కొండాపురం:** ఆదిమూర్తిపురంలో తహసీల్దార్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై మూడు అర్జీలు అందాయి. కందుకూరు సబ్‌కలెక్టర్ చిరుమణి శ్రీపూజ తనిఖీ చేశారు.

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు మండలం చాకలికొండలో తహసీల్దార్ షేక్ హమీద్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 25 అర్జీలు అందాయి. అందులో 24 అర్జీలు అసైన్‌మెంట్ పట్టాలు, ఒకటి శ్మశాన స్థలం కోసం వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీటీ చేవూరి శ్రీనివాసులు, వీఆర్వో మల్లికార్జున, సర్వేయరు విష్ణు పాల్గొన్నారు.

**చేజర్ల:** వావిలేరులో తహసీల్దార్ మురళి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు అందాయి. పొలం దారి, భూ వివాదం, 2003 ముందు ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టాల ఫ్రీహోల్డ్‌కు సంబంధించి అర్జీలు అందాయి.

**మర్రిపాడు:** డీసీపల్లి, నందవరం గ్రామాల్లో తహసీల్దార్ సీహెచ్‌వీ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. డీసీపల్లిలో మ్యూటేషన్లకు సంబంధించి 10, నోషన్ ఖాతాలకు సంబంధించి 29 అర్జీలు అందినట్లు తహసీల్దారు తెలిపారు. అలాగే నందవరంలో 48 అర్జీలు వచ్చాయని వివరించారు.

### నవ ధాన్యాల శివలింగానికి పూజలు



**కావలి:** ముసునూరులోని సాయిక్షేత్రంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. కార్తీక మాస వేడుకల్లో భాగంగా నవధాన్యాలతో శివలింగాన్ని తీర్చిదిద్ది దీపాలను వెలిగించారు. అనంతరం మందాటి చెరువులో దీపాలను వదిలారు.

### వర్షాలకు దెబ్బతిన్న శనగ, పొగాకు



**దుత్తలూరు:** మండలంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 745 హెక్టర్లలోని శనగ, 430 హెక్టార్లలోని పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని దుత్తలూరు, లక్ష్మీపురం గ్రామాల్లో వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి శనివారం పర్యటించారు. రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. లక్ష్మీపురంలో వర్షాలకు దెబ్బతిన్న మొలక దశలోని శనగ పంటను పరిశీలించారు. రైతులకు తిరిగి సబ్సిడీపై విత్తనాల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు.

### వైద్యుల నిర్లక్ష్యంపై ఆందోళన

**ఆత్మకూరు:** అనంతసాగరం మండలం గౌరవరానికి చెందిన లక్ష్మమ్మ ఇటీవల ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి శస్త్రచికిత్స చేయించుకోగా ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి ఎదుట పలువురు గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 20న లక్ష్మమ్మకు కంటి శస్త్రచికిత్స చేశారని తెలిపారు. నాలుగు రోజుల తరువాత ఇన్‌ఫెక్షన్ సోకగా ఆస్పత్రి తీసుకురాగా, మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, తిరుపతి ఆస్పత్రుల్లో చేర్పించి వైద్యం అందించారని చెప్పారు. అందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ విషయమై ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, కంటి వైద్యులు శార్వాణిను సంప్రదించగా శస్త్రచికిత్సలో ఎలాంటి పొరపాటు జరగలేదని, బాధితురాలికి ఉన్న శారీరక ఇబ్బందులతో ఇన్‌ఫెక్షన్ వచ్చి ఉండవచ్చునని తెలిపారు. అయినా తాము బాధ్యత వహించి తొలుత నెల్లూరు, తిరుపతిలోని ఆస్పత్రుల్లో వైద్యం చేయించామన్నారు. ప్రస్తుతం ఇన్‌ఫెక్షన్ తగ్గిందని, మరికొద్ది రోజుల్లోనే కంటి చూపు వస్తుందని తెలిపారు.

### పోలీసు స్టేషన్ తనిఖీ

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ శుక్రవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్సైను ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట సీఐ వేమారెడ్డి, ఎస్సై సైదులు ఉన్నారు.

# సామాజిక, రాజకీయ దార్శనికుడు అంబేడ్కర్



కావలి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



కావలి: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి



కావలి ఆర్డీఓ కార్యాలయంలో..



వింజమూరు బంగ్లాసెంటర్‌లో..

**కావలి:** సామాజిక, రాజకీయ దార్శనికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
- కావలి ఆర్డీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్డీఓ ఎం వంశీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు

**అల్లూరు:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు నివాళులర్పించారు. సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు, నాయకులు డీమల్యాద్రి, పీ సుధాకర్, ఏ రమణయ్య, ఎం నరేంద్ర, జీ రాము, జీ జీవన్‌పాల్, రాజేష్ పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్ఎంఓ డాక్టర్ ఉషాసుందరి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**చేజర్ల:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆత్మకూరు డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ.ఎస్టీ అట్రాసిటీ మెంబర్ ఎర్రగుంట పెంచలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘ సభ్యులు తానికొండ నర్సింహులు, లింగంగుంట వసంత, కుడారి ప్రవీణ్ పాల్గొన్నారు.

**సోమశిల:** అనంతసాగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఏపీ ఎన్జీఓ ఆత్మకూరు నియోజకవర్గ కార్యదర్శి బల్లి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, జేవీవీ నాయకులు గాడి సుధాకర్, ఎంపీహెచ్ఈఓ మంద చిన్నయ్య, హెల్త్ సూపర్‌వైజర్ తానికొండ ప్రసాద్, అనంతసాగరం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

**సంగం:** మండల తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి, దళిత సంఘాల నాయకులు టీ కృష్ణ, సంగం పంచాయతీ కార్యదర్శి నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**ఆత్మకూరురూరల్:** కరటంపాడులోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ పూనుగుంట రేవతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు దావా పెంచలరావు, మాజీ సర్పంచ్ పూనుగుంట సరస్వతమ్మ, ఉంటా దొరస్వామి, గ్రైడ్ సంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి ఎల్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

**ఉదయగిరి:** పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి డీన్ జీ కృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ భవనం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బీ జాషువా, బాలగురవయ్య, జూనియర్ కళాశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు శంకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు బంగ్లాసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ ఎన్.సుజన, విశ్రాంత డీఎంహెచ్ఓ మాశిలామణి, ఏడీపీఎస్ నాయకులు గుజ్జు చెన్నయ్య, అజయ్, శ్రీనివాసులు, కొత్త కృష్ణయ్య, పెద్దేటి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

**దుత్తలూరు:** మండల తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరిలోని వ్యవసాయ కళాశాలలో..



ఉదయగిరిలోని అంబేడ్కర్ భవనం వద్ద..



ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో...



అల్లూరులో..



సోమశిల: అనంతసాగరంలో..



ఆత్మకూరురూరల్: కరటంపాడులో..



సంగంలో..



దుత్తలూరు తహసీల్దార్ కార్యాలయంలో..



చేజర్లలో...